క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని ముక్కుడుదేవులపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు బుధవారం మంజూరు చేశారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు మంగళవారం దంతాలపల్లి – సూర్యాపేట రహదారిపై ఆందోళన చేపట్టారు. అందుకు స్పందించిన అధికారులు ఇస్తాలపురంలో ఉన్న కొనుగోలు కేంద్రం పరిధిలో సబ్‌సెంటర్‌గా ముక్కుడుదేవులపల్లి గ్రామానికి అనుమతులు ఇచ్చారు. ఇస్తాలపురం కొనుగోలు కేంద్రం కమిటీ ముక్కుడుదేవులపల్లిలోనూ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.

పల్లె దవాఖానాను తనిఖీ చేసిన డీఐఓ



పల్లె దవాఖానాలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఐఓ వెంకటరమణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని పల్లె దవాఖానాను బుధవారం వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. మిగిలి ఉన్న పిల్లలకు టీకాలను వెంటనే వేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. క్రమం తప్పకుండా వేసే టీకాలను ఎప్పటికప్పుడు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సీహెచ్.మణిదీప్, సీహెచ్‌ఓ ఎల్.చరణ్, ఏఎన్‌ఎం వై.దుర్గమ్మ, ఆశకార్యకర్తలు బొడ్డు సుధ, సైదమ్మ, బి.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సూర్యాపేట రూరల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా సలీమ్, జనరల్ సెక్రటరీ విక్రమ్, ట్రెజరరీ గీతారాణిలతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న పంటల నష్టం సర్వే



సర్వే చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

అర్వపల్లి : మండలంలో అకాలవర్షం, వడగళ్లతో పంట నష్టం జరగడంతో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న పంటల నష్టం సర్వే బుధవారం రెండోరోజు కొనసాగింది. మండలంలోని తిమ్మాపురం, కాసర్లపహాడ్, పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, రామన్నగూడెం, చాకలిగూడెం గ్రామాల్లో 5 బృందాలు రైతుల పొలాల వద్దకు వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ ఆర్.శశిధర్‌రెడ్డి, ఏఈఓలు శోభారాణి, సత్యం, వివిధ మండలాల వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగారం వాసికి మాస్టర్స్ డిగ్రీ పట్టా



గుండగాని భరత్

నాగారం : మండల కేంద్రానికి చెందిన గుండగాని అంబయ్యగౌడ్‌-వెంకటమ్మ దంపతుల రెండో కుమారుడు గుండగాని భరత్ ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయమైన యూనివర్సిటీ ఆఫ్ లండన్ నుంచి బుధవారం న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పట్టా పొందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో విద్యనభ్యసించి మాస్టర్స్ డిగ్రీ పట్టాను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భరత్‌ను గ్రామస్తులు, విద్యావేత్తలు అభినందించారు.

వననర్సరీలను సంరక్షించుకోవాలి

అర్వపల్లి : వేసవి దృష్ట్యా వననర్సరీలను నిర్వాహకులు సంరక్షించుకోవాలని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ కోరారు. బుధవారం మండల కేంద్రం శివారులోని సీతారాంపురం సమీపంలోని వననర్సరీని ఆయన పరిశీలించారు. ఈదురుగాలులకు పలుచోట్ల వననర్సరీలకు కొంత నష్టం జరిగిందని, నర్సరీల్లో పెంచే మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని సూచించారు. సంచులలో ఎండిపోతే వాటిని తొలగించి మళ్లీ విత్తనాలు నాటాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ ఉపేందర్‌రావ్, కార్యదర్శి మాగి నాగయ్య, టెక్నికల్ అసిస్టెంట్ దీపిక, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.మల్లయ్య ఉన్నారు.

వడ్డీ వ్యాపారం.. పేదోడిపై భారం

- అవసరానికి అప్పు..ఆపై నిలువు దోపిడీ
- తిరుమలగిరిలో యథేచ్ఛగా అక్రమంగా వడ్డీ వ్యాపారం
- నెలకు రూ.50లక్షలకు పైగా లావాదేవీలు



తిరుమలగిరిలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా ప్రయత్నం చేస్తున్న బాధితులు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణాల్లో అనుమతి లేని వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారం పట్టణాల్లోనే కాకుండా పల్లెలు, తండాల్లోనూ విస్తరించింది. కూలీలు, చిరు వ్యాపారులు, ఆటో నడుపుకునే వారే లక్ష్యంగా అధిక వడ్డీలతో అప్పులు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు వడ్డీ వ్యాపారులు. అప్పు ఇచ్చే సమయంలో ఖాళీ చెక్కులు, పట్టాదారు పాసుపుస్తకాలు, బంగారు నగలు, స్థిరాస్తి డాక్యుమెంట్లను సైతం కుదవ పెట్టుకుంటున్నారు. ఈ దందా అధికంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో జోరుగా సాగుతుంది. అవసరానికి రుణం కావాలంటే బ్యాంకులు సవాలక్ష నిబంధనలు విధిస్తున్నాయి. రోజువారి చెల్లింపులకు అంగీకరించవు. దీంతో రోజువారి వ్యాపారాలు చేసుకోవడానికి సామాన్య, మధ్య తరగతి ప్రజలు గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. పట్టణంలో చాలా మంది వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలో నెలకు రూ.50లక్షలకు పైగా లావాదేవీలు జరుగుతున్నట్లు అంచనా. కూరగాయలు, తోపుడు బండ్లు, చిన్నచిన్న టీ కొట్లు, పాన్ డబ్బా వ్యాపారులతో పాటు ఆటో డ్రైవర్లు, ఇతర వ్యాపారాలు చేసే వ్యాపారాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు ఇస్తున్నారు. ఇచ్చిన రోజు నుంచి గడువు వరకు ఒకేసారి లెక్క కట్టి ముందుగానే వడ్డీ కట్ చేసుకుంటారు.

నూటికి రూ.5నుంచి రూ.10వరకు వడ్డీ..

నిబంధనల ప్రకారం వడ్డీ వ్యాపారం చేయాలంటే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి. లైసెన్స్ తీసుకొని నూటికి రూ.2వడ్డీ తీసుకోవాలి. కాని ఇది అమలు కావడం లేదు. నూటికి రూ.5నుంచి రూ.15వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇచ్చిన అప్పు వాయిదాలు సకాలంలో చెల్లించకుంటే గూండాయిజం చేయడం, ఇళ్ల వద్దకు వెళ్లి అల్లరి చేసి పరువు తీయడం, ఇళ్లల్లో సామాన్లు తీసుకొచ్చేయడం, ఆస్తులను తనఖా కింద స్వాధీనం చేసుకోవడం చర్యలకు పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

వేధింపులు తాళలేక దంపతుల ఆత్మహత్యా యత్నం..

మండల కేంద్రానికి చెందిన ఎడ్ల వెంకన్న, రమాదేవిల కుమారుడు సాయికుమార్ స్థానికంగా ఓ వడ్డీ వ్యాపారి వద్ద రూ.70వేలు తీసుకున్నాడు. అధిక వడ్డీతో 16నెలలకు రూ.3 లక్షలు అయింది. వడ్డీ తీసుకున్న సాయికుమార్‌ను వడ్డీ కట్టమని వేధించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో వడ్డీ ఇచ్చిన వ్యక్తి సాయికుమార్ తల్లిదండ్రుల వద్దకు వచ్చి వేధించడంతో వారు ఈనెల 14న స్థానిక తెలంగాణ చౌరస్తాలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నం చేసుకున్నారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి చిరు వ్యాపారుల వద్ద రూ.కోటి వరకు అప్పు చేసి ఉడాయించాడు. మండల కేంద్రంలో ఎలాంటి లైసెన్సులు లేకుండా ప్రతి నెల చిట్టీ వ్యాపారాలు కూడా సాగుతున్నాయి. ఇందులో ప్రభుత్వ ఉద్యోగస్తులు అధికంగా ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వడ్డీ వ్యాపారులపై, లైసెన్సులు లేని చిట్టీలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

“వడ్డీ వ్యాపారులు వేధించినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. వడ్డీ వ్యాపారం చేయాలంటే లైసెన్స్ ఉండాలి. ఇచ్చిన డబ్బులకు సాధారణ వడ్డీలు మాత్రమే వసూలు చేయాలి. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం, అధిక వడ్డీలు వసూలు చేయడం నేరం. ఇలాంటి సంఘటనలపై బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– రాజేష్, సీఐ నాగారం

బీఆర్‌ఎస్ హయాంలోనే మైనార్టీలకు గుర్తింపు



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే మైనార్టీలకు సరైన గుర్తింపు లభించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో గల గ్రేస్‌చర్చిలో నూతన ప్రార్థన మందిర భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచానికి దిక్సూచి అని, ఆయన కరుణ, సేవాగుణం, శాంతి, సహనం ప్రేమతో జీవనగమనం నేటితరానికి ఎంతో ఆదర్శమన్నారు. సమాజంలో చెడు మార్గాలను, వికృత పోకడలను అరికట్టడమే అన్ని మతాల సారాంశం అన్నారు. మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ స్వరూపారాణి, వివిధ చర్చిల పాస్టర్లు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ అడ్డగింత

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామశివారులో గల ప్రభుత్వ భూమిని ఓ ఫంక్షన్ హాల్ యజమాని ఆక్రమించే ప్రయత్నం చేస్తుండగా బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. సర్వే నంబర్ 497లో ప్రభుత్వ భూమి పక్కన ఫంక్షన్‌హాల్ ఉండగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తుండడంతో విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకున్నారు. గతంలోనూ ఈ భూమిని ఆక్రమించుకునేందుకు కంచె వేయగా రెవెన్యూ అధికారులు అడ్డు చెప్పి కంచెను తొలగించారు. మళ్లీ బుధవారం అదే భూమిని సుమారు 20గుంటలు ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు వచ్చి పనులు నిలిపివేశారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



పెన్‌పహాడ్ : స్టేషన్‌హౌజ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు



మద్దిరాలలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెన్‌పహాడ్ : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్)లను రెగ్యులరైజ్ చేసి, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్యదర్శులను జేపీఎస్‌లుగా మార్చాలని సంఘం మండల అధ్యక్షుడు రమేష్ అన్నారు. బుధవారం ఈనెల 28 నుంచి సమ్మెకు వెళ్తుండటంతో ముందస్తు సమాచారంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌజ్ అధికారి యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు చంద్రశేఖర్, సతీష్, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నకు, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు రేసు తరుణ్, నాతి రమేష్, గంట మహేష్, మంగ, ఉమ, లలిత, తేజశ్రీ, పాల్గొన్నారు.



నాగారం : వైస్‌ఎంపీపీ మణిమాలకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

నాగారం : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) రెగ్యూలరైజ్ చేయాని పలువురు జేపీఎస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాలకు ఈనెల 28నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తైన సందర్భంగా ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, గడిచిన 4ఏళ్ల ప్రొబేషనరీని సర్వీసు కాలంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు కొమ్ము అరుణ్, శోభన్, వీరేందర్, భవానీ, శ్రీనివాస్, సతీష్, వెంకటేష్, జిందగిరి, సంతోష్, శివ, అంబేద్కర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ భిక్షం

సూర్యాపేట రూరల్ : కంటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. బుధవారం మండలంలోని బాలెంలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలను గుర్తించి ప్రతి ఒక్కరికీ కంటిచూపు ఉండే విధంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించడం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసాని రమేష్‌నాయుడు, కార్యదర్శి విక్రం, వైద్యాధికారి ప్రవంతి, సబిత, స్వరూప, మేరమ్మ, నాగమణి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక

అర్వపల్లి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కుంచమర్తి గ్రామ సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. కేంద్రాలలో పోసిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు కోఆర్డినేటర్ గౌసుద్దీన్, వీఓఏ మన్నె సుజాత, గోవర్ధన్, కందుకూరి సైదులు, గోళ్ల నవీన్, మన్నె గురువయ్య, వీరాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి మార్కెట్‌కు భారీగా ధాన్యం రాక



తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లోనే అత్యధికంగా 28,595బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి సునీల్‌కుమార్ బుధవారం తెలిపారు. కనిష్టంగా క్వింటాకు రూ.1,410, గరిష్టంగా రూ.1,749 ధర పలికినట్లు వెల్లడించారు.

తిరుమలగిరిలో వర్షం



వర్షానికి నేలవాలిన వరి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఉరుములతో కూడిన 28మిమీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షానికి కోతకు వచ్చిన వరిచేలు నేలవాలాయి. ఐకేపీ కేంద్రాలలో ధాన్యం రాశులు, కొన్నిచోట్ల బస్తాలు తడిశాయి. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ బుధవారం రమణారెడ్డి పరిశీలించారు. ధాన్యాన్ని వెంట వెంటనే కాంటాలు వేసి మిల్లులకు పంపాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నూతనకల్ : అకాల వర్షాలకు రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. వరి పొలాలు నేలవాలడంతో పూర్తిగా ధాన్యం రంగు మారిందని తెలిపారు. అధికారులు స్పందించి సత్వరమే కాంటాలు నిర్వహించడంతో పాటు రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాప రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరి, మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వరికి ఎకరానికి రూ.30వేలు, మామిడికి రూ.50వేల నష్ట పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి కళ్లెం కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, జటంగి గణేష్, సామ ఉపేందర్‌రెడ్డి, వీరమల్ల భాను ఉన్నారు.



నూతనకల్ : ధాన్యం రాశులను పరిశీలిస్తున్న రామచంద్రయ్య



నాగారం : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పంట నష్టాన్ని అంచనా వేయాలని వినతి

నాగారం : నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయాలని మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన రైతులు బుధవారం మండల తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు, ఈదురుగాలులకు వరిపంట పూర్తిగా ధ్వంసమైందని వాపోయారు. గ్రామంలో నష్టపోయిన వరి పంటలను పరిశీలించడానికి వచ్చిన ఏఈఓ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పూర్తిస్థాయిలో సర్వే చేయకుండానే వెళ్లిపోయాడని ఆరోపించారు. తిరిగి సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. వినతి అందించిన వారిలో రైతులు వడ్డే వెంకన్న, నరేష్, శ్రీనివాస్, రమేష్, సోమయ్య, వెంకటయ్య, పరుశరాములు, సాయిలు, యాదగిరి, సోమన్న, వెంకన్న, కరుణాచారి, ఈదయ్య, ఎల్లయ్య, రాములు, రాధ ఉన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకు దూరం



మాట్లాడుతున్న వట్టె జానయ్యయాదవ్

సూర్యాపేట రూరల్ : మూసీకాల్వను ఆక్రమించినట్లు బీజేపీ నాయకుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు చేసిన ఆరోపణలు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటానని డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ సవాల్ విసిరారు. బుధవారం మండల పరిధిలోని బాలెంల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోపణలు చేయడం తోక ముడవడం సంకినేనికి అలవాటుగా మారిందన్నారు. నిరాధారణ ఆరోపణలు చేసి రాజకీయ పబ్బం గడుపుకోవడం సంకినేనికి అలవాటన్నారు. బలహీన వర్గాలకు చెందిన నాపై, బలహీన వర్గాల నాయకులను పంపి సంకినేని రాక్షస ఆనందం గడుపుతున్నాడని అన్నారు. సంకినేనికి దమ్ముంటే స్వయంగా ఆయనే చర్చకు రావాలన్నారు. సర్వే నంబర్ 480లో మూసీ కాల్వ ఆక్రమణ జరిగిందని చేస్తున్న ఆరోపణ నిరాధారమన్నారు. మూసీ కాల్వను ఆక్రమించలేదని కలెక్టర్ ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల కమిటీ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. నన్ను అడ్డం పెట్టుకొని మంత్రి జగదీశ్‌రెడ్డిపై ఆరోపణలు చేయాలని అనుకుంటే సూర్యుడు మీద ఉమ్మివేసినట్లేనన్నారు. సమావేశంలో నాయకులు చాంద్‌పాషా, వాసుదేవరెడ్డి, సుదర్శన్, వెంకన్న, రఫీ, సైదులు, రాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దిరాల : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకోని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆనాటి గురువులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బోలగాని భిక్షపతి, ఎల్లు అశోక్‌రెడ్డి, కోట శ్రీను, కడవ శ్రీను, సంధ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మద్దిరాల : మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రేట్నేని జన్నయ్య కుమారుడు నరేష్, కోడలు సుమ, చిన్న మనవడు జస్విత్‌లు హైదరాబాద్‌లోని కుషాయిగూడలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. దీంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగఢ అనురాధ బుధవారం గ్రామంలో మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, సర్పంచ్ బర్పటి ఉపేందర్, వెంకటయ్య, ఉబ్బని రఘుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లయ్య, వెంకన్న, శ్యామ్ ఉన్నారు.

నూతనకల్ : మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పగిళ్ల లింగయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో గ్రామ ఎంపీటీసీ గాడ్డుల రజితలింగరాజు బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి 50కేజీల బియ్యాన్ని అందజేశారు. వారి వెంట అవిలయ్య, అంజయ్య, నారాయణ, అబ్బాస్, అనిల్ తదితరులు ఉన్నారు.

కుటుంబానికి పరామర్శ

నాగారం : మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన పాదిల ఇస్తారి(65) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య బుధవారం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామ కాంగ్రెస్ నాయకుడు సూరారపు వెంకటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో బుధవారం జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పరామర్శించారు.

నిమ్మానాయక్ మృతికి సంతాపం

తుంగతుర్తి : మండల పరిధిలోని ధరావత్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ధరావత్ నిమ్మానాయక్ (32) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.


బీజేపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం



పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 14వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పంతంగి సాలయ్య ఆధ్వర్యంలో వందమంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలో బీజేపీకి రోజురోజుకు మద్దతు పెరుగుతుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో ఎవరికి న్యాయం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రెండు సార్లు కేసీఆర్ సీఎం అయినా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పట్టణంలో రోడ్డు వెడల్పులో ఇల్లు, భూమి కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కర్నాటి కిషన్, నుసిందర్ రెడ్డి, మన్మధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎల్లంల యాదగిరి

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రపంచ కార్మిక దినోత్సవమైన మే డేను విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి కోరారు. మంగళవారం మండలంలోని తొండ గ్రామంలో ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా మే డే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మే డే ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి శ్రీకాంత్, ఎండీ ఎక్బాల్, సైదులు, మల్లయ్య, అశోక్, కొమురయ్య, వెంకన్న, యాకన్న తదితరులు పాల్గొన్నారు.